# 22. వాటీజ్ యువర్ నేమ్?

అమెరికాకి చెందిన ఒక డిక్షనరీ రచయిత గురించి ఒక జోక్ చెప్పారు. అది నిజంగా (జరిగిందనే అంటారు, కాని) జరిగి వుండకపోవచ్చు. అయితే సరైన మాట వాడడం దానికి సరైన అర్థం తెలుసుకోడం అనే ఈ రెండు విషయాలూ మాటలు (భాష) ఉపయోగించే వారికి ఎంత ముఖ్యమో ఆ జోక్‌లో స్పష్టంగా చెప్పడమైంది. ఆ జోకు ఇది:

డిక్షనరీ రాసే ఆ రచయితకి తన ఇంట్లో మేడమీద గదిలోనే రోజులో ఎక్కువ కాలం గడపడం కొన్నేళ్లుగా అలవాటు. పెన్‌లో సిరా అయిపోవడం నుంచి గొంతు తడి ఆరిపోవడం వరకు ఏం జరిగినా, అక్కడ కూర్చునే; కిందికి సంకేతం పంపిస్తాడు - ఒక ఎలెక్ట్రిక్ బెల్ ద్వారా. రాత్రేమిటి, పగలేమిటి, అతనికి భార్యతోను ఇతర కుటుంబ సభ్యులతోను గడిపే అవకాశం కుదరడం లేదు, ఈ కొన్నేళ్ల నుంచీనూ.

అటువంటి కాలంలో ఒకసారి ఆయన హటాత్తుగా మేడ మెట్లు దిగి వచ్చేసరికి మెట్ల దగ్గిర ఉన్న చిన్న గదిలో తన భార్య, వంటవాడు: ఒకర్నొకరు కౌగలించుకుని ముద్దులాడుకుంటూ కనిపించేరు. భార్యని అలా చూసిన వెంటనే అతనికి నోటంట మాట రాలేదు. ఆవిడే ఊడి ఇవతల పడి "మిస్టర్..... అయామ్ సర్‌ప్రయిజ్‌డ్!" అందిట. దానికి ఆ మిస్టరు "తప్పు! ఆశ్చర్యపడింది నేను. నువ్వు నిర్ఘాంతపోయానని అనాలి" అన్నాడట.

మనుషుల పేర్లు, వస్తువుల పేర్లు, మొదలైన నామవాచకాల్ని వాటికి నిర్దేశించిన విధంగా కాక తమకి తోచిన విధంగా ఉచ్చారణ చేసే రాసే మీడియాలో విసిరేసే వారు కొందరుంటారు. నా స్నేహితుడు ఒకాయన హాంగ్‌కాంగ్ అనే పట్నం పేరు మనం అందరం అన్నట్టు హాంకాంగ్ అని కాకుండా చాలా కష్టపడి "హాంగుకాంగ్" అని పలుకుతాడు. కింగ్‌కాంగ్ అనే పేరు కూడా మనందరిలాగా కింకాంగ్ అని కాకుండా "కింగ్‌కాంగ్" అంటూ ఉచ్చరిస్తాడు. ఇదొకరకం అయితే ఢిల్లీ దూరదర్శన్ వారు దక్షణాది ప్రాంతానికి చెందిన మనుష్యుల పేర్లు పట్టణాల పేర్లు మొదలైనవి మంచి హాస్యం ఉత్పత్తి చేసే విధంగా పలకడం మనలో కొందరికి తెలుసు. ఆ మధ్య ఒక తెలుగు సినిమా ప్రసారం చేస్తూ "ఊరుమడ్డిబాటుకూలు" అన్నారు. (అది "ఊరుమ్మడి బతుకులు" అని పలకవలసింది.) ప్రస్తుతం టీ.వి.లో వస్తున్న భారతంలో పాండవుల భార్య పేరు 'ద్రౌపతి' అంటున్నారు. ద్రుపదరాజు కూతురు 'ద్రౌపది' కదా అని ఇన్నాళ్లూ అనుకుంటున్న మూగ ఆడియన్సులు 'ద్రౌ-పతి' అనే పదంలో 'ద్రౌ' అంటే ఐదు అనే అర్థం ఉండొచ్చేమో అనీ, 'ద్రౌ-పతి' అనగా ఐదుగురు భర్తలు కలది అనే అర్థం ఉందేమో అనీ చర్చోపచర్చల్లో మునిగి తేలుతున్నారు.

ఎన్టీరామారావు గారు ఒకసారి తను పాల్గొన్న మీటింగుకి తను మహనీయుడని అనుకొంటున్న ఒకాయన వస్తే, మీటింగు అయిపోయాక "మీరు మీటింగుకి వచ్చినందుకు కృతగ్నతలు అని చెప్పేరట. "కృతజ్ఞతలు" అని చెప్పడానికి గ-ఘ-లలో రెండో అక్షరానికి బదులు మొదటిది వాడడం వల్ల కొంత తేడా వచ్చిందని ఒకరు అనుకుంటే, ఆయనకి 'జ్ఞ' అనే సంయుక్తాక్షరాన్ని 'గ్న' అని ఉచ్చరించే అలవాటుందని ఇంకొకాయన వివరించి చెప్పి

అపార్థాన్ని పరిహరించారు. అగ్నానం, గ్నాపకం, గ్నాతులు లాంటివి (గ్నాపకం ఉన్నంత వరకు) ఆయన ఎక్కడెక్కడ ఏ మాట ఎలా వాడారో తలా వొకరు వివరించేరు.

1973లో నేను విశాఖపట్నం ఆర్.డి.ఓ. ఆఫీసులో పనిచేస్తున్నప్పుడు అనకాపల్లి తాలూకా ఆఫీసుకి ఇన్‌స్పెక్షన్‌కి వెళ్లేను. మధ్యాహ్నం భోజనం కోసం తాలూకాఫీసు ఉద్యోగి ఒకరు నన్నొక భోజన హోటలుకి తీసుకువెళ్లారు. అక్కడ రెండు రాటలకి కట్టి ఆరడుగుల పొడుగూ ఒక అడుగు వెడల్పూ గల బోర్డు ఎత్తుగా ఉంది. అదీకాక వాకిట్లో మూడడుగుల పొడుగు ఒక అడుగు వెడల్పూ గల మరో బోర్డు ఉంది. దాని మీద ఇలా రాసుంది!

శ్రీ అన్నపూర్ణా శా
ఖాహార భో
జనహోటల్
ప్రొప్రయిటర్ : ఆ
కెళ్ల మల్లిఖా
ర్జున శర్మ.
భోజన మురడీ.

ఆ లైన్ల సర్దుబాటు చూస్తేనే నాకు మతిపోయింది. 'ఇదేమిటండీ, అచ్చుతరావు గారూ!' అన్నాను గాభరాపడి. "నే చెప్తాగా, ఫర్వాలేదు రండి" అన్నాడతను.

భోజనం చేసేక చేతులు కడుక్కొని గల్లా పెట్టి దగ్గిర కూర్చున్న ఆయనతో అన్నాను. "మీరేనా, ప్రొప్రయిటర్?"

"నేనే, ఏం?"

"శాఖాహార కాదండీ, శాకాహార అని వ్రాయాలి" అన్నాను.

"ఏమిటి, మీరంటున్నది?" అన్నాడతను, కంగారుపడి.

"మీ వాకిట్లో బోర్డుమీద శాఖాహార అని ఉందండి, నిజానికి **"శాకాహార"** అని ఉండాలి. శాఖ అంటే కొమ్మ. శాకము అంటే కాయగూర, అనగా వెజిటేరియన్. అలాగే తమ పేరు మల్లిఖార్జున శర్మ అని కాకుండా **మల్లికార్జున** శర్మ అని వ్రాయించవలసింది" అని వివరించేను.

ఆయన నమస్కారం పెట్టేడు. "భోజనం తమకి నచ్చిందా, అది చెప్పండి ముందు" అన్నాడు.

"నచ్చిందనుకోండి, ఐనా..." అన్నాను.

"ఇఖనేం, దయచెయ్యండి" అని బైటికి దారి చూపించాడాయన.

బైటికొచ్చేక బోర్డును అచ్చుతరావు గారికి మళ్లా చూపించి "భోజనమురడీ" అనే లైను చూపించి "కనీసం భోజనం సిద్ధం అనో భోజనం తయారు అనో వ్రాయించవలసింది" అన్నాను.

"అలా రాయించడానికి బోర్డు వెడల్పు సరిపోదు గానీ, పదండి" అన్నాడు అచ్చుతరావు గారు.

అంతమంచి భోజనం కనక మింగుడు పడింది గాని, మల్లికార్జున శర్మ గారు తన పేరే తాను తప్పుగా వ్రాయించుకోవడం, "శాఖాహారం" నాకు మింగుడు పడలేదు. తోవ అంతా సణుక్కుంటూనే అచ్చుతరావుతో నడిచేను.

"ఇదిగో ఈయనే మా ఎకౌంటెంట్ గారు. ఉదయం పూట శెలవు పెట్టేరు. మీరిప్పుడు ఆయన రిజిష్టర్లు చెక్ చెయ్యొచ్చు" అని అచ్చుతరావు వెళ్లారు.

నేనక్కడ కూర్చుని "మీ పేరు?" అన్నాను.

"మధుసూధనరావు"

"యు మీన్ మధుసూదనరావు?" అన్నాను.

"అదేనండీ, మధుసూదనరావు" అన్నాడతను.

"రెండు 'ద'లికి ఒత్తులుండవు. ఒక్కదానికే. మధుసూదన అంటే మధుకైటభులనే రాక్షసుల్లో మధు అనే వాణ్ణి సూదన అంటే చంపినటువంటి వాడు అనగా విష్ణుమూర్తి వారి పేరు. మధుసూధన -కాదు- మధుసూదన అని ఉండాలి" అన్నాను.

"ఏమోనండీ, ఆ బేధాలు మాకు తెలీవండీ" అన్నాడతను.

"అదిగో, మళ్లీ! బేధాలు కాదు, **భేదాలు** అనాలి" అన్నాను.

అతను అరచేత్తో నుదుటి మీద కొట్టుకున్నాడు. పక్కకి తిరిగి "సార్, హెడ్గుమస్తాగారూ! ఈయన చూడండి, రిజిష్టర్లు చెకింగ్ చేసుకోమంటే ఏదేదో పెంటపెడుతున్నారు. నేనిక్కడ ఉండాలా, నా సీట్లోకి పోయి పని చేసుకోమంటారా?" అన్నాడు.

హెడ్ గుమస్తాగారు లేచి వచ్చి "ఏంటిసార్" అన్నాడు నాతో, ఎంతయినా ఆర్.డి.వో. గారి ఇన్స్పెక్షన్ శ్టాఫ్ కదా, నేను!

"అయామ్ సారీ మిస్టర్," అని ఆగాను అతని పేరు గుర్తు రాక.

"జనార్దన్ రావు" అన్నాడతను.

"అదిగో, మళ్ళీ! జనార్దన్ ఏమిటి , **జనార్దన్** అనాలి. మీ పేర్లు మీరే తప్పు పలుకుతారేమిటి?" అని నేను మళ్లా గాభరా పడ్డాను.

"ఇన్స్పెక్షన్ కొచ్చినోళ్లు మా పేర్లు సరిగా లేవని భాదపడుతూ కూర్చుంటే యలాగ సార్. పనిగానియ్యండి ముందర. దొరగారు మూడు గంటల కల్లా ఇన్స్పెక్షన్ నోట్స్ ట్రైపై పోవాలన్నారు. మమ్మల్నిలా భాదలు పెట్టడం మీకు న్యాయం కాద్సార్" అన్నాడు హెడ్ గుమస్తాగారు.

"భాద కాదండీ, **బాధ** అనాలి" అన్నాను చిరునవ్వుతో.

హెడ్ గుమాస్తాగారు నన్ను బలత్కారంగా లేవతీసి, దూరంగా నడిపించుకుపోయి చెప్పేడు. ఏన్యువల్ ఇన్స్పెక్షన్ సందర్భంగా ఆర్.డి.ఓ శ్టాఫ్‌కి "ఏడాది మామూలు" గా రావలసిన ఎమౌంటు అంతా సాయంకాలం జీపు ఎక్కేలోపు గా జమ కట్టేస్తారుట. కుంటిసాకులూ శల్య పరీక్షలు లేకుండా తట్ట తగలేసేయమని రెండు చేతులు పట్టుకున్నాడు "ఇవి చేతులు కావు" అన్నాడు.

"అయితే ఇవి కాళ్లనా, మీ ఉద్దేశం? అలా అయితే నాకు మొత్తం నాలుగు కాళ్లనా, మీ తాత్పర్యం? నేనొక జంతువుననా, మీ అభిప్రాయం?" అని నేను ఆర్గ్యూ చెయ్యలేదు. ★